నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం

బుధవారం 1 ఏప్రిల్ 2026

బాధిత కుటుంబాలకు

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

అమరచింత, మార్చి 31, (నినాదం):
అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఒక వరమని కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు కేజీ మహేందర్ రెడ్డి, అరుణ్ కుమార్ తెలిపారు. మంగళవారం అమరచింత మునిసిపాలిటీ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అమరచింత మునిసిపాలిటీ తో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 33 మంది బాధితులకు 11, 96, 000 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ముదిరాజు రమేష్ డైరెక్టర్ శ్యామ్ కుమార్ ఎస్సీ సెల్ అధ్యక్షులు ప్రకాశం కిసాన్ సెల్ మండల అధ్యక్షులు లక్ష్మీకాంత్ రెడ్డి, జింక రవి, హనుమంతు నాయక్ తౌఫిక్ తో పాటు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

గోపాలపూర్ వాసి మిద్దె సుదర్శన్ బార్

అసోసియేషన్ అధ్యక్షులుగా ఎన్నిక

వనపర్తి ప్రతినిధి, మార్చి 31 (నినాదం) :
పానగల్ మండలం గోప్లాపూర్ గ్రామానికి చెందిన మిద్దె సుదర్శన్ న్యాయవాది హైదరాబాద్ రాజేంద్రనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఎన్నిక కావడం జరిగింది.న్యాయవాదిగా అనతికాలంలో పేరు తెచ్చుకొని తన కలుపుగోలుతనంతో, సహచర న్యాయవాదులతో కలసి అనేక సమస్యలపై చైతన్య పరచి సామాజిక కార్యక్రమాలలో పాలుపంచుకోవడం వల్ల ఈ ఎన్నిక సాధ్యమైందని మండల వాసులు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. అధ్యక్షులుగా ఎన్నికైన మిద్దె సుదర్శన్ ను జిల్లా బిఆర్ఎస్ మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్ శుభాకాంక్షలు తెలిపారు. సుదర్శన్ భవిష్యత్తులో ఇంకా ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు

ట్రాన్స్‌కో ఎస్ఈకి వినతి పత్రం ఇచ్చిన
కాటారం సర్పంచ్

కాటారం మార్చి 31,2026(నినాదం):
ఎస్ఈకి వినతి పత్రం అందజేస్తున్న కాటారం సర్పంచ్ అర్హులందరికీ సోలార్ కనెక్షన్లు ఇప్పించండి. కాటారం మేజర్ గ్రామ పంచాయతీ పరిధి కాటారం, గారెపల్లి గ్రామాలలోని అర్హులందరికీ సోలార్ కనెక్షన్లు ఇప్పించాలని కాటారం సర్పంచ్ పంతకాని సడవలి కోరారు. మంగళవారం ట్రాన్స్కో ఎస్ఈని కలిసి వినతి పత్రం అందజేశారు. కాటారం గ్రామ పంచాయతీని సూర్య ఘర్ స్కీం కింద ఎంపిక చేసి సోలార్ కనెక్షన్లు మంజూరు చేస్తున్నారనీ, కానీ గారెపల్లి హాబిటేషన్ చేసి అర్హులైన ప్రతి ఒక్కరికి సోలార్ కనెక్షన్లు మంజూరు చేయాలని కోరారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ రికవరీ

జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):
పోగొట్టుకున్న సెల్ ఫోన్ లను భూపాలపల్లి పోలీసులు రికవరి చేశారు. సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్ సహాయంతో పోలీసులు పోగొట్టుకున్న సెల్ ఫోనులను తక్కువ సమయంలో బాధితులకు అప్పగించారు, మోతే దేవేందర్ జక్కుల మహేష్ అనే ఇద్దరు వ్యక్తులు సెల్ ఫోన్ లు మిస్సవ్వగా, ఆ వివరాలు పోర్టల్ ద్వారా సెల్ ఫోన్ నెంబర్‌ను www.ceir.gov.in వెబ్సైటు లో పొందుపరిచి ఫోన్లు రికవరీ చేసి వారికి అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ నరేష్ కుమార్ మాట్లాడుతూ ప్రజలు తమ సెల్ఫోన్ పోగొట్టుకున్నట్లయితే పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన వెంటనే ఛీర్ ఫోర్టల్ ద్వారా మొబైల్ కు సంబధిత వివరాలు ఒఒఒ.ఛవఱతీ.స్రశీఙ.ఱఅ వెబ్సైటులో వెళ్లి అందులో పూర్తిగా వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

వార్డులో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి
-కౌన్సిలర్ అయేషా సిద్ధిక



వనపర్తి ప్రతినిధి, మార్చి 31 (నినాదం):
వనపర్తి పట్టణంలోని 16వ వార్డులో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కౌన్సిలర్ అయేషా సిద్దిక కోరారు. మంగళవారం మున్సిపల్ కమీషనర్ వెంకటేశ్వర్లు కు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 16వ వార్డులో అనేక సమస్యలు ఉన్నాయని, ముఖ్యంగా సిసి రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, పాత కోట కందకం పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయని చెప్పారు. వార్డులో మురికి కాలువలు శిథిలావస్థకు చేరుకున్నాయని, కొత్త డ్రైనేజీలు ఏర్పాటు చేయవలసిన అవసరం ఉందని వివరించారు. వీధిలైట్లు లేకపోవడంతో కొన్నిచోట్ల అంధకారం నెలకొన్నదని ఆమె పేర్కొన్నారు. వెంటనే వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఆమె కమీషనర్ ను కోరారు

మహిళల సాధికారతకు

దోహదం చేస్తున్న మహాలక్ష్మి పథకం
-కలెక్టర్ చిత్రా మిశ్రా

కరీంనగర్, మార్చి 31(నినాదం):
కరీంనగర్ జిల్లాలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించే మహాలక్ష్మి పథకం విజయవంతంగా అమలవుతోందని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. ఈ పథకం మహిళల ఆర్థికా భివృద్ధికి తోడ్పడుతూ వారి జీవితాల్లో మార్పు తీసుకువస్తోందన్నారు.కరీంనగర్ బస్టాండ్‌లో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ, ఇప్పటివరకు జిల్లాలో 6.91 కోట్ల మహిళలు ఉచితంగా ప్రయాణించి సుమారు 308.84 కోట్ల రూపాయల ప్రయాణ ఖర్చును ఆదా చేసుకున్నారని చెప్పారు. ఈ సౌకర్యంతో మహిళలు ఉపాధి, విద్య, వైద్యం వంటి అవసరాలకు సులభంగా ప్రయాణిస్తున్నారని పేర్కొన్నారు.గ్రామ స్థాయిలో పథకంపై మరింత అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని సూచించిన ఆమె, మహాలక్ష్మి పథకం మహిళల సాధికారతకు బలమైన వేదికగా నిలుస్తోందని అన్నారు. కుటుంబ అవసరాలు, ఉద్యోగాలు, విద్య, పర్యటనలు వంటి అనేక అవసరాలకు ఈ పథకాన్ని మహిళలు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

ఆంధ్రాలో గురువు.. తెలంగాణలో శిష్యుడు సీఎంలు

-చేతనైతే ఢిల్లీ అమరావతిలో ధర్నా చేయండి..ఇక్కడ డ్రామాలు ఆపండి

-మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

వనపర్తి ప్రతినిధి, మార్చి 31 (నినాదం):
ఆంధ్రాలో గురువు..తెలంగాణలో శిష్యుడు సీఎం లుగా ఉన్నారని, శిష్యుడికి సలహాదారు ఆంధ్రా నుండి వచ్చిన ఆదిత్యనాథ్ దాస్ అని రాష్ట్ర మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విమర్శించారు. మంగళవారం హైదరాబాదులోని తెలంగాణ భవన్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి, నాగర్ కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి, దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ పాలమూరు, నల్లగొండ, రంగారెడ్డిలకు కృష్ణా జలాలే శరణ్యమని,సాగునీటి రంగంలో తెలంగాణకు అన్యాయం చేసింది కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. కేసీఆర్ నాయకత్వంలో అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడి తెలంగాణ సాధించుకున్నామని, తెలంగాణ నీటిని ఆంధ్రాకు వదిలిపెట్టి రేవంత్ రెడ్డి గురుదక్షిణ చెల్లించుకుంటున్నాడని మండిపడ్డారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో తాత్కాలిక ఒప్పందంలో కృష్ణా జలాల్లో కేంద్రం నిర్దేశించిన నిబంధనలకు విరుద్ధంగా ఆంధ్రా వ్యవహరిస్తున్నదని, ఎలాంటి ఇండెంట్లు లేకుండా ఆంధ్రాకు నీటిని తరలిస్తున్నారని, తెలంగాణ ప్రభుత్వం చోద్యం చూస్తున్నదని చెప్పారు. గత రెండేళ్లలో ఏపీ అతి ఎక్కువగా నీళ్లను తరలిస్తే, తెలంగాణ అతి తక్కువగా వాడుకున్నదని, అపెక్స్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటుకు ఎందుకు డిమాండ్ చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. నల్లగొండ, పాలమూరు జిల్లాలో పంటలు చేతికి వచ్చే దశలో ఉన్నాయని, నోటికాడికి వచ్చే బుక్క నేలపాలవుతుందని, రైతుల కష్టార్జితం నాశనం అవుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సర్కార్ నడుపుతున్నారా ? సర్కస్ నడుపుతారా ?కేంద్రం పరిధిలో ఉన్న కేఆర్ఎంబీ తెలంగాణకు చేస్తున్న అన్యాయం గురించి కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఒక్కనాడు కూడా ఎందుకు ప్రశ్నించరు ?తెలంగాణకు సాగునీటిలో జరుగుతున్న అన్యాయం మీద ఒక్కనాడు ఎందుకు అడగరని నిరంజన్ రెడ్డి దుయ్యబట్టారు. ఏపీ ప్రభుత్వం ఇంటర్ బేసిన్ ట్రాన్స్ ఫర్ కు వ్యతిరేకంగా కృష్ణా బేసిన్ లో లేని హంద్రీ నీవా, పెన్నా బేసిన్, గాలేరు నగరి కి తరలిస్తున్నదని, ఇప్పుడు బనకచర్లతో ముందుకు గోదావరి జలాలు కృష్ణాకు తరలించే ప్రయత్నం చేస్తున్నారని,ఈ ఏడాది దాదాపు 45 రోజులు ఆలస్యంగా ఎత్తిపోతల పంపులు ప్రారంభించారని వివరించారు.ఈ ఏడాది అత్యధికంగా కృష్ణా నదికి వరదలు వచ్చాయని, సాగునీరు ఎత్తిపోసుకోకపోవడమే కాకుండా.. ఏపీ జలదోపిడీని నిరోధించలేకపోయారని,రెండు వారాల ముందే హెచ్చరించినా ఈ ప్రభుత్వం మేలు కోలేదని అన్నారు. సాగునీటి దోపిడీని అడ్డుకోకుండా ఇప్పుడు పంటలు ఎండిపోయే ఉన్నప్పుడు ఇప్పుడు శ్రీశైలం వద్ద తీరిగ్గా ధర్నా చేస్తున్నారని,ఎస్సెల్బీసి కూలిపోతే కనీసం అందులో ఇరుక్కున్న శవాలను బయటకు తీయలేదని, వట్టెం పంప్ హౌస్ నీట మునిగితే ఒక్క రోజు కూడా వెళ్లి పరిశీలించలేదని పేర్కొన్నారు.వట్టెం పంప్ హౌస్ పర్యటన పెట్టుకున్న నీటిపారుదల శాఖ మంత్రి అక్కడి వరకు రాకుండా మధ్యలోనే వెళ్లిపోయారని ఆయన గుర్తు చేశారు.10 శాతం పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పనులను ఆరు నెలల్లో రూ.1200 కోట్లతో పూర్తి చేసి ఉంటే నేడు జిల్లాలోని రిజర్వాయర్లు నింపుకునే అవకాశం ఉండేదని అన్నారు.నీళ్లు మలుపుకునే చేతగాక, వెళ్లిపోయిన నీళ్ల కోసం శ్రీశైలం డ్యాం వద్ద ధర్నా చేస్తున్నారని, మీకు దమ్ముంటే, మీకు ప్రజలు, రైతుల ప్రయోజనాలు ముఖ్యం అనుకుంటే, మీకు పదవీలాలస లేకుంటే మిగిలిపోయిన పాలమూరు పనులు చేపట్టాలని, రేవంత్ రెడ్డి ఇంటి ముందు ధర్నా చేయాలి .. లేదంటే పదవులు వదులు కోవాలని ఆయన డిమాండ్ చేశారు. పాలమూరు బిడ్డ అని చెప్పుకునే రేవంత్ ను పనులు ఎందుకు చేయడం లేదని, తట్టెడు మట్టి ఎందుకు తీయలేదని నిలదీయాలని ఆయన సూచించారు. సీఎంకు, మీకు పెళ్లిళ్లు, పేరంటాలు, ఢిల్లీ ప్రయాణాలు తప్ప ఏపీకి వెళ్లి ఎందుకు ప్రశ్నించలేదని,అపెక్స్ కౌన్సిల్ సమావేశం కోసం డిమాండ్ చేసేందుకు ఢిల్లీకి ఎందుకు వెళ్లలేదని,చేతులు కాలినంక ఆకులు పట్టుకున్నట్లు ఇప్పుడు ధర్నా పేరుతో షో చేస్తున్నారని మండిపడ్డారు.కేఎల్ఐ ఎత్తిపోతలను సక్రమంగా వాడితే 5 లక్షల ఎకరాలకు సాగు నీరు అందుతుందని, రిపేరులో ఉన్న రెండు పంపుల మరమ్మతులకు రూ.10 కోట్లు ఇవ్వకుండా రెండేళ్లుగా పెండింగులో పెట్టారు..5 పంపులు నడిపితే సమృద్ధిగా నీరు వాడుకోవచ్చని అన్నారు.పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ద్వారా భీమా, జూరాల ఆయకట్టుకు కూడా వాడుకునేలా డిజైన్ చేశారని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కాల్వలు రద్దు చేసి నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతలను తీసుకువచ్చారని చెప్పారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ద్వారా కొడంగల్, నారాయణపేట ప్రాంతాల్లో లక్ష 30 వేల ఎకరాలకు రెండు పంటలకు సాగునీరు ఇచ్చేందుకు కేసీఆర్ డిజైన్ చేస్తే .. రేవంత్ రెడ్డి 60 వేల ఎకరాలకు ఒక్క పంటకు నీటికి తెచ్చేలా డిజైన్ చేశారని, ఉన్న నీళ్లను వాడుకోకుండా, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పూర్తి చేయకుండా పాలమూరు, నల్లగొండ, రంగారెడ్డి రైతులకు ఈ సర్కారు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. పాలమూరు డీపీఆర్ వెనక్కి పంపి రెండేళ్లయినా ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఇక జెన్ కో, రెడ్కో, ట్రాన్స్ కో కు కూడా ఆంధ్రా అధికారులను తీసుకువచ్చి వారికింద తెలంగాణ ఉద్యోగులను పనిచేయిస్తున్న దుస్థితి నెలకొందని, పాలమూరు అవసరాల కోసం 55 ఏళ్ల కాలంలో కాంగ్రెస్ కట్టిన ప్రాజెక్టుల్లో కనీసం 20 నుండి 25 టీఎంసీలకు సరిపడా రిజర్వాయర్లు నిర్మించలేదని,35 లక్షల ఎకరాల సాగుభూమి ఉన్న పాలమూరుకు కాంగ్రెస్ చేసిన పాపం ఇదని అన్నారు. పాలమూరు ఎత్తిపోతల కింద కేసీఆర్ 70 టీఎంసీల రిజర్వాయర్లు నిర్మించారన్నారు.

తూతూ మంత్రంగా రైతు సర్వసభ్య సమావేశం

-సర్వసభ్య సమావేశంలో కనిపించని రైతుల జాడ

-అధికారుల తీరుపై మండిపడ్డ యువరైతు హరీష్ వర్మ అప్పని



జమ్మికుంట, మార్చి 31 (నినాదం):
ప్రాథమిక వ్యవసాయ సంఘం లిమిటెడ్ వీణవంక లో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో పట్టుమని పది మంది రైతులు కూడా హాజరు కాలేదని ఇది పూర్తిగా అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని యువరైతు అప్పని హరీష్ వర్మ అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సొసైటీలో 4500 మంది రైతులకు సభ్యత్వం ఉండగా కనీసం పట్టుమని పదిమంది కూడా రాకపోవడం హాస్యాస్పదంగా ఉందని రైతులు లేకుండా సర్వసభ్య సమావేశం ఎలా నిర్వహించారని సంబంధిత సీఈవో చందుపట్ల ప్రకాష్ రెడ్డి ని వివరణ కోరగా మేం పాంప్లెంట్ కొట్టించాము సమాచారం ఇచ్చాము వాట్సాప్ ద్వారా మెసేజ్ కూడా చేశాము అయినా రైతులు రాలేదని నిర్లక్ష్య సమాధానం ఇచ్చారని ఆయన తెలిపారు. 1200 రుణం తీసుకున్న రైతులు ఉన్నారని దీనిపై ప్రతిసారి ఇలానే తూతూ మంత్రం కింద సర్వసభ్య సమావేశాలు నిర్వహిస్తూ ఎజెండాలు ఆమోదాలు తెలుపుకుంటూ కాలం వెళ్లబోస్తున్నారని గతంలో కూడా అనేక సార్లు ప్రాథమిక వ్యవసాయ సంఘం వీణవంక మీద ఉన్నతాధికారులు కలెక్టర్ గారికి సంబంధిత అధికారులకు ఎన్నోసార్లు ఎన్నో విధాలుగా ఫిర్యాదులు చేశారని అయినప్పటికీ సీఈవో చందుపట్ల ప్రకాశ్ రెడ్డి చలనం లేకుండా ఒంటెద్దు పోకడను నిర్వహిస్తూ కాలయాపన చేస్తూ రైతుల తెలియాల్సిన విషయాలను తెలపకుండా వారి ఆదాయ ఖర్చు వివరాలను వెల్లడించకుండా రూపాయికి పది రూపాయల ఖర్చుతో సంఘాన్ని లూటీ చేస్తున్నారని ఆరోపించారు. రుణం తీసుకున్న రైతుగా ఆవేదన వ్యక్తం చేస్తున్నానని వెంటనే సంబంధిత అధికారులు సమగ్ర విచారణ జరిపి సర్వసభ్య సమావేశం రైతుల సమక్షంలో నిర్వహించి జమా ఖర్చు వివరాలను రైతుల ముందుంచి రుణాలు తీసుకున్నా రైతుల తీర్మానాలతో ఆమోదాలు తెలిపే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

కరీంనగర్, మార్చి 31(నినాదం):
మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పంజాల స్వామి గౌడ్ ఆధ్వర్యంలో కమాన్‌పూర్ గ్రామానికి చెందిన భూస కనకలక్ష్మి, మేడి హరిచందనలకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు. ఈ చెక్కులు మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో మంజూరు చేపించి లబ్ధిదారులకు మంగళవారం రోజున అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ అధ్యక్షుడు పంజాల కృపాసాగర్‌తో పాటు, కార్యకర్తలు భూస సంపత్, మేడి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు ఘన సన్మానం

-పన్నుల వసూళ్లలో రాష్ట్రంలోనే మొదటి స్థానం

-కమిషనర్ సేవలు అభినందనీయం

-కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకరి రమేష్

జమ్మికుంట, మార్చి 31 (నినాదం) : జమ్మికుంట మున్సిపాలిటీ ని పన్నుల వసూళ్లలో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిపిన మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఆయాజ్ కలిసి మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించిన జమ్మికుంట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకరి రమేష్. మంగళవారం జమ్మికుంట మున్సిపల్ కార్యాలయంలో కమీషనర్ ను కలిసి శుభాకాంక్షలు తెలిపిన పట్టణ అధ్యక్షుడు సుంకరి రమేష్ యూత్ కాంగ్రెస్ నాయకులు సాయిని రవి అమ్మ వెంకటేష్. ఈ సందర్భంగా సుంకరి రమేష్ మాట్లాడుతూ, జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుండి పట్టణాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తూ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా తన కర్తవ్యాన్ని నిర్వహిస్తున్న ఆయాజ్ సేవలు అభినందనీయమని అన్నారు. ఒకవైపు అభివృద్ధి పై దృష్టి పెడుతూనే మరొకవైపు పన్నుల వసూళ్లలో సిబ్బందికి సూచనలు సలహాలు ఇస్తూ ప్రజల సహకారంతో 100% పన్నులు వసూలు చేసి రాష్ట్రంలోనే జమ్మికుంట మున్సిపాలిటీ నెంబర్వన్ స్థానంలో ఉంచడం గర్వించదగ్గ విషయమని రమేష్ పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే ఉత్సాహంతో పనిచేసి జమ్మికుంట మున్సిపాలిటీ మరింత ఉన్నత స్థితికి తీసుకువెళ్లాలని ఆశాభావం వ్యక్తం చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. పట్టణ అభివృద్ధిలో భాగంగా కాంగ్రెస్ పార్టీ నుండి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని అభివృద్ధి విషయంలో రాజీ పడకుండా పట్టణ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కమిషనర్ ను కోరినట్లు తెలిపారు.

ప్రశాంతంగా ముగిసిన నగరపాలక సంస్థ బడ్జెట్ సమావేశం

-రూ.312.42 కోట్ల బడ్జెట్‌కు ఏకగ్రీవ ఆమోదం

-అభివృద్ధి, పారిశుధ్యం, మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం

-కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్

కరీంనగర్, మార్చి 31(నినాదం):
కరీంనగర్ నగరపాలక సంస్థ 20262027 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్, సర్వసభ్య సమావేశం మేయర్ కొలగాని శ్రీనివాస్ అధ్యక్షతన ప్రశాంతంగా జరిగింది. కమీషనర్ ప్రఫుల్ దేశాయ్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు సమక్షంలో జరిగిన ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉదయం తెలంగాణ రాష్ట్ర గీతంతో ప్రారంభమైన సమావేశం జాతీయ గీతంతో ముగిసింది.మొత్తం రూ.312.42 కోట్ల అంచనా బడ్జెట్‌కు పాటు 11 అంశాలకు పాలకవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. బడ్జెట్‌లో నగరపాలక సంస్థ ఆదాయం నుండి పారిశుధ్యం, ఉద్యోగుల జీతాలు, రుణ చెల్లింపులు వంటి అంశాలకు నిధులు కేటాయించగా, వనమహోత్సవానికి ప్రత్యేకంగా 10 శాతం నిధులు కేటాయించారు. అదనంగా, మొత్తం నిధులలో మూడో వంతు విలీన గ్రామాలు, అభివృద్ధి చెందని ప్రాంతాలు, బలహీన వర్గాలు మరియు మురికివాడల మౌలిక సదుపాయాల కోసం కేటాయించారు.జీరో అవర్‌లో సభ్యులు పారిశుధ్యం, తాగునీటి సరఫరా, లీకేజీలు, రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు, ఆస్తి పన్నులు, ఎంక్రోచ్‌మెంట్, వీధి కుక్క లు, కోతుల సమస్యలు తదితర అంశాలను ప్రస్తావిం చారు. వీటిపై మేయర్, కమీషనర్ స్పందిస్తూ దశల వారీగా పరిష్కారం చేపడతామని హామీ ఇచ్చారు.నగరాన్ని శుభ్రం, హరితం, ఆధునికంగా తీర్చిదిద్దడం లక్ష్యంగా పనిచేస్తున్నామని మేయర్ తెలిపారు. ప్రతి డివిజన్‌కు రూ.10 లక్షలు కేటాయిస్తూ, 66 డివిజన్లకు రూ.6.60 కోట్లు అభివృద్ధి పనులకు మంజూరు చేశారు. అదనంగా, లైటింగ్ నిర్వహణ కోసం పరికరాల కొనుగోలు, ప్రతి డివిజన్‌కు ఒక ఆటోరిక్షా ఏర్పాటు, వేసవి కాలంలో తాగునీటి సమస్యలు లేకుండా ప్రత్యేక ప్రణాళికలకు ఆమోదం తెలిపారు.వీధి దీపాల ఏర్పాటు కోసం టెండర్లు పిలవగా ఇప్పటికే కొంత మేర సరఫరా జరిగినట్లు తెలిపారు.

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి
-కలెక్టర్ బి. సత్యప్రసాద్.

మల్లాపూర్, మార్చి 31 (నినాదం):
మల్లాపూర్ మండలం ముత్యంపేట గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మంగళవారం పరిశీలించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతంగా చేయాలని అధికారులకు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ మంజూరైనా ఇందిరమ్మ ఇండ్లను పూర్తిస్థాయిలో గ్రౌండింగ్ చేయాలని. ఇందిరమ్మ ఇళ్ల పథకం నిర్మించుకునే ప్రతి ఇంటికి తెలంగాణ ప్రభుత్వం 5 లక్షల రూపాయలు అందజేస్తుందని తెలిపారు. ఇటుక, కంకర, బేస్మెంట్ పై ధరల నియంత్రణ ఇండ్లు లబ్ధిదారులకు ధరలు అనుగుణంగా ఉండేలా అధికారులను కమిటీ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు . గడువులోపు వారికి కేటాయించిన టార్గెట్లను సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ భవనాలు ప్రభుత్వం నిర్దేశించిన పరిణామం కలిగి ఉండాలని లబ్ధిదారులకు తెలిపారు. ఆర్థిక పరమైన సమస్యలుంటే ఐకెపి సహకార సంఘాల ద్వారా రుణాలు పొందాలని అన్నారు. దశలవారిగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు బిల్లులు చెల్లింపు నేరుగా ఆధార్ లింక్ చేయబడిన లబ్ధిదారుడి ఖాతాలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం పలు మార్కింగ్, బేస్మెంట్, స్లాబ్ లెవల్ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి ఇళ్ల లబ్ధిదారులతో నేరుగా మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తిచేసి గృహప్రవేశం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెట్ పెల్లి ఆర్డీవో నరసింహారావు, హౌసింగ్ పిడి ప్రసాద్, ఎంపిడివో జగదీష్, ముత్యంపేట సర్పంచ్ తేలు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వడ్ల నిల్వ సదుపాయాలను బలోపేతం చేయాలి
కలెక్టర్ బి. సత్యప్రసాద్

మల్లాపూర్, మార్చి 31 (నినాదం) :
మల్లాపూర్ మండలం ముత్యం పేట గ్రామంలోని నిజాం షుగర్ ఫ్యాక్టరీని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మంగళవారం సందర్శించారు. రాబోయే రబీ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని ఫ్యాక్టరీ పరిధిలో ఉన్న గోదాములను ఆయన పరిశీలించారు. వడ్ల నిల్వకు గోదాములు అనువుగా ఉన్నాయా అనే విషయాన్ని సమగ్రంగా పరిశీలించిన కలెక్టర్, గోదాముల సామర్థ్యం, భద్రతా ప్రమాణాలు, తేమ నియంత్రణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు. వడ్లను సురక్షితంగా నిల్వ చేయడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రైతులు ఇబ్బందులు పడకుండా ముందస్తు ప్రణాళికలతో నిల్వ సదుపాయాలు సిద్ధం చేయాలని చెప్పారు. రాబోయే రబీ సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమగ్ర చర్యలు తీసుకోవాలని, నిల్వ సదుపాయాలను బలోపేతం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో మెట్‌పల్లి ఆర్డీవో నరసింహారావు తధితరులు అధికారులు పాల్గొన్నారు.

అకాల వర్షం అపార నష్టం



మల్లాపూర్, మార్చి 31 (నినాదం) :
మల్లాపూర్ మండలంలో సోమవారం రాత్రి బలమైన ఈదురు గాలులతో కూడిన అకాల వర్షం రైతన్నలకు కన్నీరు మిగిల్చింది. ఈదురు గాలులతో కూడిన వర్షాల కారణంగా మండలంలోని పలు గ్రామాల్లో పంటలు నేలకొరిగాయి. వరి, మొక్కజొన్న పంటలతో పాటు మామిడి తోటలు కూడా తీవ్రంగా దెబ్బతిన్నాయి. గాలుల వేగం కారణంగా మామిడి చెట్ల నుంచి పెద్ద ఎత్తున కాయలు రాలిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి.. కష్టపడి పండించిన పంటలు కండ్ల ముందే నేల వాలడంతో మండల రైతాంగం లబోదిబోమంటున్నారు కొన్ని చోట్ల చెట్ల కొమ్మలు కూడా విరిగిపోవడం గమనార్హం. అకాల వర్షానికి నష్టపోయిన తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. ఇంత జరిగినా ఏ గ్రామానికి ఇంతవరకు వ్యవసాయ విస్తీర్ణ అధికారులు వెళ్లి ఫీల్డ్ విజిట్ చేయకపోవడం పట్ల ఆయా గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.